సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న యూసీడీ డీపీఓ శ్రీనాథ్

బౌద్ధనగర్: సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి సోమవారం బౌద్ధనగర్ కమ్యూనిటీహాలులో జీహెచ్‌ఎంసీ అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ సుభాష్‌రావు, యూసీడీ డిప్యూటీ పీఓ శ్రీనాథ్‌లు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి చేపట్టే సర్వేకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని, అందులో భాగంగానే సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సర్వేలో భాగంగా ప్రజల వద్ద నుంచి సేకరించాల్సిన వివరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

సనత్‌నగర్: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ అన్నారు. క్రియాశీల సభ్యత్వ నమోదు పత్రాన్ని సోమవారం సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కస్నూరి క్రాంతికుమార్‌కు అందజేశారు. శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ పరిపాలనాదక్షతకు యావత్ ప్రజానీకం సంతోషం వ్యక్తంచేస్తున్నారన్నారు. డివిజన్ నుంచి 21 మంది క్రియాశీల సభ్యత్వ పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



దేవదానం

బౌద్ధనగర్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైయ్యాడు. ఈ ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన మేరకు.. రామ్‌నగర్‌లోని వైఎస్‌ఆర్ పార్క్ సమీపంలో నివాసం ఉంటున్న దేవదానం(84) ఈ నెల 1న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి తిరిగిరాకపోవడంతో అతని కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా, బంధువులను వాకబు చేసినా ఎటువంటి సమాచారం అందలేదు. అదే రోజు రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన వెంకటేష్(45) పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు. మద్యానికి బానిసైన వెంకటేష్‌ను వదిలి అతని భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం మద్యం తాగిన వెంకటేష్ రాత్రి 10.30 గంటల సమయంలో లాలాగూడ–సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

భోజన విరామ సమయంలో ఉద్యోగుల నిరసన

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించొద్దని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. పదెకరాల స్థలం కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, కంప్యూటర్ ఇంజినీర్ వసంతరావులు మాట్లాడుతూ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం దేశంలోనే మూడో మెగా యూనివర్సిటీ అని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో డిగ్రీ నుంచి పరిశోధన కోర్సుల వరకు వివిధ కోర్సుల్లో విద్యను అందిస్తున్నామని చెప్పారు. నూతన విద్య విధానం ప్రకారం విద్యార్థులకు విద్యావకాశాలను అందించడానికి వివిధ కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. దేశంలో స్థూల నమోదు నిష్పత్తిని పెంచడానికి ఈ విశ్వవిద్యాలయం దూర విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఈ నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జేఏసీ నేతలు, అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



హరహర శంభో శంకర..

సనత్‌నగర్: హరహర శంభో శంకరా..అంటూ భక్తిపూర్వక నినాదాలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. కార్తీకమాసం.. ఆపై సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము 5 గంటల నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు మొదలయ్యాయి. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం శివాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని అందంగా అలంకరించారు. రుద్రాక్షలతో స్వామివారికి చేసిన విశేష అలంకరణ భక్తులను కనువిందు చేసింది. సాయంత్రం ఆకాశ దీపోత్సవంతో పాటు కార్తీక దీపోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రభుత్వ పాఠశాలలే దేశానికి పట్టుగొమ్మలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



జామై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: దేశంలోని అధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలే దేశానికి పట్టుగొమ్మలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని సీతాఫల్‌మండిలోని జామై ఉస్మానియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీడీఎల్ సహకారంతో టాయిలెట్ క్లీనింగ్ మిషన్స్, ఫర్నీచర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలను మరింతగా పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతగాన కృషి చేశానని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ప్రతిభ కల్గిన ఉన్నత విద్యావంతులే టీచర్లుగా ఉంటారని, ప్రైవేట్ స్కూల్స్‌లో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలనీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ స్కూల్‌లలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, రాజకీయ నాయకులు అన్ని వర్గాలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ నెల 8న జరుగనున్న దిశ మీటింగ్‌లో హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీసీ సుభాష్‌రావు, కార్పొరేటర్ సామల హేమ, బిజేపి నాయకులు నాగేశ్వర్ రెడ్డి,అంబాల రాజేశ్వర్‌రావు తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బండమైసమ్మనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషిచేస్తానని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె. హేమలత అన్నారు. డివిజన్‌లోని బండమైసమ్మనగర్‌లో రూ. 40 లక్షల వ్యయంతో వేయనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కె. హేమలత మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మీపతి, రమాకాంత్, జగ్గు, మోహన్‌రావు, శ్రీనివాస్, బాల్‌రాజ్, శ్రీకాంత్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: మైత్రీవనం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అమీర్‌పేట ఆర్‌ఎస్ బ్రదర్స్, కాకతీయ మెస్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, ప్లే గ్రౌండ్ ఏరియా, శీష్‌మహల్ థియేటర్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు..



సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.31, నల్లవంకాయ 50, పొడుగు వంకాయ 33, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 80, క్యాప్సికమ్ 80, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 33, క్యారెట్ 80, దొండ 28, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 95, గోకరకాయ 55, కీర 17, దోసకాయ 35, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూ అభివృద్ధికి కృషి చేయండి



ఓఎస్‌డీ ప్రొ.జితేంద్రనాయక్‌కు పుష్పగుచ్ఛాన్ని అందచేస్తున్న ప్రేమ్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అభివృద్ధికి కృషిచేయాలని తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ వీసీ ప్రొ.కుమార్, ఓఎస్‌డీ జితేంద్రనాయక్‌లను కోరారు. సోమవారం వారిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి అభినందనలు తెలిపారు. ఓయూలో అధ్యాపకుల ఉద్యోగాలను భర్తీ చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను పెంచాలని కోరినట్లు తెలిపారు.

ఓయూలో డీన్ల నియామకం



లావణ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఇద్దరు డీన్లను నియమించారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ చరిత్ర విభాగం హెడ్ ప్రొ.లావణ్య యూజీసీ అఫైర్స్ డెవలప్‌మెంట్ డీన్‌గా, సోషల్ సైన్స్ డీన్‌గా ప్రభుత్వ పాలనశాస్త్రం హెడ్ ప్రొ.అరుణ జ్యోతి సోషల్ సైన్స్ డీన్‌గా నియమితులయ్యారు. వీసీ ప్రొ.కుమార్ చేతుల మీదుగా నియామకపత్రాలను అందుకుని పదవీ బాధ్యతలు చేపట్టారు.

నేడు చలో హైదరాబాద్

బౌద్ధనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఉమర్‌ఖాన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇందిరా పార్క్ వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఈ మహా ధర్నాకు ఆటో కార్మికులందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరుతున్నామన్నారు.

నేటి మహాధర్నాను విజయవంతం చేయాలి

లాలాపేట: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద మంగళవారం నిర్వహించతలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలనీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ఏఐటీయుసి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ప్రకటించిన ఆటో డ్రైవర్లకు రూ 12 వేలు ఆర్థిక సహాయం వెంటనే అందించాలనీ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్‌ల సాధన కోసం ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు వేలాదిగా ఈ మహాధర్నాకు తరలి రావాలని కోరారు.

ట్రాఫిక్ విధుల్లో హైడ్రా సిబ్బంది

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నియంత్రణలో హైడ్రా సేవలను వినియోగించుకుంటున్నారు. రెండు రోజులనుంచి ట్రాఫిక్ వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో పాల్గొంటున్నారు. వెస్ట్ జోన్ పరిధిలోని ప్రధాన కూడళ్ల అయిన మైత్రీవనం, పంజగుట్ట, ఖైరతాబాద్, విరించి హాస్పిటల్, అగ్రసేన్ చౌరస్తా, జూబ్లీహిల్స్ చౌరస్తా, సాగర్ సొసైటీ చౌరస్తా, శ్రీనగర్ కాలనీ టీ–జంక్షన్, కేబీఆర్ పార్కు చౌరస్తా, సీవీఆర్ చౌరస్తా, జర్నలిస్టు కాలనీ చౌరస్తాల్లో వీరిని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా ట్రాఫిక్ విధుల్లో తీసుకుంటున్నారు. వెస్ట్‌జోన్‌కు 18 మంది హైడ్రా సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణ కోసం కేటాయించారు. వీరు అన్ని చౌరస్తాల్లో స్టాప్‌లైన్లు దాటకుండా వాహనదారులను అప్రమత్తం చేస్తారు. మొదటి దశలో ఆ చౌరస్తాల్లో ఉండే ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ విధులు, నిబంధనల ఉల్లంఘనలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. చౌరస్తాల్లో యూటర్న్‌లు బ్లాక్ కాకుండా వీరు చూస్తుంటారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించడం చేస్తారని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు.

ఫోన్ తీసుకొని పారిపోయే యత్నం

వెంగళరావునగర్: ఫోన్ మాట్లాడాలని తీసుకుని పారిపోతున్న దొంగను ఓ యువకుడు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన మధురానగర్‌లో చోటుచేసుకుంది. ఓ యువకుడు సోమవారం తెల్లవారుజా మున మైత్రీవనం వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురు యువకులు అక్కడకు వచ్చి అతనిని ఫోన్ చేసుకోవాలని మొబైల్ అడిగారు. వెంటనే ఆ ఫోన్‌తో ద్విచక్ర వాహనంపై పారిపోవాలని ప్రయత్నించగాయువకుడు ఆ దొంగను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దొంగను విచారణ చేయగా ఒకరి పేరు నవీన్, మరో యువకుడి పేరు రోహన్ అని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ మోడల్ హై స్కూల్‌కు నిధులు

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీ క్యాంపస్‌లోని ఓయూ మోడల్ హై స్కూల్ అభివృద్ధి పనులకు నిధులు అందచేయనున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరైన మంత్రికి మోడల్ స్కూల్‌లో తాగునీరుకు, బోర్‌వెల్‌కు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని కిషన్ రెడ్డికి వినతి పత్రం అందచేసినట్లు హెచ్‌ఎం జ్యోతి శ్రీ తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి నిధులను అందచేయనున్నట్లు హామీ ఇచ్చినట్లు స్కూల్ హెచ్‌ఎం చెప్పారు. ఈ నెల 8న నగరంలో జరిగే దిశ సమావేశం ప్రభుత్వ పాఠశాల సమస్యల పై సమావేశం ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.





ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన

రసూల్‌పురా : సికింద్రాబాద్ జింఖానా మైదానంలో అభ్యుదయ డ్వాక్రా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు జంటనగరాల ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు, హస్త కళాకారులు తయారు చేసిన కళాంకారి, హ్యాండ్లూమ్స్, కళాఖండాలు, తోలు బొమ్మలు, కొండపల్లి బొమ్మలు, నిర్మల్ పేయింటింగ్స్ తదితర ఉత్పత్తులు 300 స్టాల్స్‌లో ప్రదర్శనలో సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. ఎగ్జిబిషన్ నిర్వాహకులు దేవకి దేవి మాట్లాడుతూ ఈ నెల 17 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం ద్వారా ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. రసూల్‌పురా గన్‌బజార్ కమ్యూనిటిహాళ్లో సోమవారం అర్హులైన 44 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకం క్రింద మంజూరైన లక్షా నూట పదహారు రూపాయల చెక్కులను శ్రీగణేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణమంత్రిత్వ శాఖ ఆధీనంలో కంటోన్మెంట్ ప్రాంతం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సకాలంలో పేద ప్రజలకు అందడం లేదన్నారు. దీనికి పరిష్కారం బోర్డు ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో వీలినం చేయడమేనని అన్నారు. సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్. స్థానిక కాంగ్రెస్ నాయకులు శాంసన్ రాజు, నరేష్, నాగేష్, యూసఫ్, యాదగిరి, నాగినేని సరిత, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

డిప్యూటీ మేయర్



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: తరగతి గది చదువుతో పాటు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో నారాయణ స్కూల్ తార్నాక బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ పేరుతో స్పోర్ట్స్ మీట్ వార్షిక క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ వేడుకల్లో డిప్యూటీ మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ క్రీడలతో శారీక ధృడత్వం, ఏకాగ్రత, మానసిక ఉల్లాసం కల్గుతందన్నారు. క్రీడాకారులకు ఉజ్వలమైన భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో డిజిఎం గోపాల్ రెడ్డి, ఏజిఎం బాలపరమేశ్వర్‌రావు, హెచ్ ఆర్ లక్ష్మీ గోలి, యోగేందర్, కోఆర్డినేటర్స్ ఆజాద్, లక్ష్మీభవాని,నూర్, పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



నిలిచిపోయిన పనులను చూపిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో నిర్మించాలని తలపెట్టిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి కేటాయించిన రూ. 30 కోట్ల నిధులను ప్రభుత్వం వేంటనే విడుదల చేయాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సమితి సభ్యులు నిలిచిపోయిన భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దాదాపు 1500 మంది విద్యార్థులు ఉన్న పురాతన భవనాలను తొలగించి ఒకే భవనంలో ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలు నిర్మించాలని అప్పటి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం రూ. 29.75 కోట్లు మంజూరు చేస్తూ 2022 జులై 26న ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిధుల లేమి కారణంగా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవ్వాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు బాలరాజ్, యాదవ్, జగదీష్ గౌడ్, సునీల్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్,అజీజ్, రవీందర్, సాగర్ లు పాల్గొన్నారు.

శ్రీసాయిగణపతి ఆలయ చైర్మన్‌గా కూన శ్రావణ్‌కుమార్‌గౌడ్



కూన శ్రావణ్‌కుమార్‌గౌడ్‌తో కమిటీ సభ్యులు..

సనత్‌నగర్: బేగంపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఫ్లైఓవర్ కింద ఉన్న శ్రీసాయి గణపతి ఆలయ నూతన చైర్మన్‌గా కూన శ్రావణ్‌కుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఇంతకముందు ఆలయ చైర్మన్‌గా వ్యవహరించిన కూన వెంకటేష్‌గౌడ్ అనారోగ్యం కారణంగా మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆలయ చైర్మన్ పదవిని భర్తీ చేసే క్రమంలో ఆలయ ప్రతినిధులు పలుమార్లు భేటీ అయ్యారు. ఈ క్రమంలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజిబాబుముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నరహరిగౌడ్, కోశాధికారి నాయుడు నేతృత్వంలో కమిటీ ప్రతినిధులు ఆలయంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో కూన వెంకటేష్‌గౌడ్ పెద్ద కుమారుడు కూన శ్రావణ్‌కుమార్‌గౌడ్‌కు ఆలయ నూతన చైర్మన్ బాధ్యతలు అప్పగించాలని అందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే ఆయన రెండో కుమారుడు గౌరీశంకర్‌గౌడ్‌ను ఆలయ అభివృద్ధి సలహాదారుడిగా నియమిస్తూ సభ్యులందరూ తీర్మానించారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు శంకర్‌యాదవ్, విజయ్‌కుమార్‌ముదిరాజ్, దశరథ్, రాంచందర్, చంద్రకళ, విజయలక్ష్మీ, కొమరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేత



తార్నాక చౌరస్తాలో ఫుట్‌పాత్‌పై వెలసిన డబ్బాలను తొలగిస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుట్‌పాత్ అక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరిస్తున్న నేపధ్యంలో రానున్న రోజుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ తొలగింపునకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. తార్నాక చౌరస్తా నుంచి లాలాపేట వరకు రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌పై వెలసిన అక్రమ నిర్మాణాలను, వ్యాపార సముదాయాలను, డబ్బాలను తొలగించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో రెండు మూడు జేసీబీలతో చేపట్టిన కూల్చివేతలను చూసిన ప్రజలు లాలాపేటకు హైడ్రా వచ్చిందంటూ చర్చించుకున్నారు.